# అక్షర శిల్పుల సృష్టికర్త ఝున్ను మాస్టర్

- ఉద్యమంలా క్యాలీగ్రఫీ శిక్షణ
- రేపు జాతీయ చేతిరాత దినోత్సవం



బోర్డుపై క్యాలీగ్రఫీ నేర్పిస్తున్న ఝున్నుమాస్టారు


చేతిరాతపై శిక్షణకు హాజరైన విద్యార్థులు

యడ్లపాడు: ప్రపంచ చరిత్రకు మూలాధారం అక్షరాలే. ఉలితో రాళ్లపై అక్షరాలు చెక్కిన కాలమైనా..కీబోర్డుపై వేళ్లను కదిలించే కంప్యూటర్ యుగమైనా అక్షరాలది చెక్కుచెదరని స్థానమే. స్వరం, వ్యక్తిత్వం వేలిముద్రలు, చేతిరాతలు ఏ ఇద్దరిలోనూ ఒకేలా ఉండవు. కీబోర్డులు, టచ్‌స్క్రీన్‌లు వచ్చిన తరువాత కాగితం మీద పెన్నుతో రాసే అలవాటు పోతోంది. విద్యార్థులు తప్ప మిగిలిన వారిలో ఎక్కువ శాతం సంతకాలకే పెన్ను పట్టే పరిస్థితి. నేటి ఆధునిక యుగంలో టెక్నాలజీ ఉపయోగించుకోవడంతోపాటు నైపుణ్యాల మెరుగు కోసం అందమైన చేతిరాత అభ్యాసనం తప్పనిసరి. మనలో అభిలాష, సహనం, సాధన, క్రమశిక్షణ ఉంటే చాలు అందమైన చేతిరాత మన సొంతమవుతుంది. జాతీయ చేతిరాత దినోత్సవాన్ని ఏటా జనవరి 23న నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా క్యాలీగ్రఫీ శిక్షణను ఓ ఉద్యమంలా నిర్వహిస్తున్న యడ్లపాడు మండలం కొత్తసాలన గ్రామంలోని ఎంపీపీఎస్(ఏఏ) పాఠశాల ఉపాధ్యాయుడైన డాక్టర్ షేక్ ఝున్ను సాహెబ్‌పై ప్రత్యేక కథనం..

**పలు అవార్డులు, గౌరవ డాక్టరేట్**

2023 మార్చిలో డబల్ పెన్, పెన్సిల్స్‌తో క్యాలీగ్రఫీ..లెటర్ ఇన్నర్, ఔటర్ డిజైన్లపై 250 మందితో కలిసి 200 మోడల్స్‌ను రాయించి అంతర్జాతీయ స్థాయి 'వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్' ఖ్యాతిని సాధించారు. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయిలో పలు పోటీలు నిర్వహించే ముంబాయికి చెందిన రంగోత్సవ్ నిర్వహణ సంస్థ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ రంగాల్లో నిష్ణాతులై వివిధ సేవలకు అందించే ప్రతిష్టాత్మక 'కళాజీవి' 2023 ఏడాది అవార్డు ఝున్నుసార్‌కు అందించడం విశేషం. అంతటితో తన ఆశ, ఆశయాలకు ఫుల్‌స్టాప్ పెట్టకుండా క్యాలీగ్రఫీ శిక్షణపై ప్రత్యేక పుస్తకాలను సైతం రచించాడు. ప్రత్యేక శిక్షణకు రాలేని వారికి, సులభతరంగా చక్కని చేతిరాతను స్వయంగా నేర్చుకునేందుకు ఆయా పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారు. సమాజం పట్ల చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా 2024 నవంబర్4న కాశ్మీర్‌కు చెందిన గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ ట్రస్ట్ ఝున్నుసాహెబ్‌ను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. హైదరాబాద్ సిబిల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, గుంటూరు సుగుణా సైన్స్ అకాడమీ, నెల్లూరు సింహపురి ఖగోళ విజ్ఞాన్ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ చివుకుల హనుమంతరావు ఛారిటబుల్ ట్రస్ట్ అందించే భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో గురుపురస్కార్ రాష్ట్రస్థాయి అవార్డును అందించింది. మంచి క్యాలీగ్రాఫర్లను సుక్షితులుగా తీర్చిదిద్దడం, ఉద్యోగ విరమణ తర్వాత కూడా వీటిపై మరింత దృష్టి సారించడం ..రాష్ట్రంలో అత్యధిక అందమైన చేతిరాత కలిగి నవారి శాతాన్ని పెంపొందించడమే జీవితాశమని ఝున్నుసార్ చెప్పారు.

**పాతికేళ్ల ప్రస్థానం**

ఉపాధ్యాయ వృత్తిలోకి చేరిన పాతికేళ్ల నుండి ఆయన విద్యార్థులకు పాఠాలు బోధించడమే కాదు తనకున్న చేతిరాత నైపుణ్యాలను పలువురికి నేర్పిస్తూ వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులకే కాకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు కర్సివ్, ప్రీ-కర్సివ్, ఇటాలిక్ స్టైల్, ప్రింట్, క్యాలీగ్రఫీల్లో చాలా కాలంగా ఉచితంగా శిక్షణ ఇస్తుండటం విశేషం. ఒకవైపు వృత్తిలో అంకితభావంగా పనిచేస్తూనే మరోవైపు ప్రవృత్తి అయిన దస్తూరి నైపుణ్యాన్ని పలువురికి నేర్పిస్తూ ఆత్మసంతృప్తిని పొందుతున్నాడు. తాను శిక్షణ పొందిన తర్వాత నాలుగేళ్ల కాలంలో ఇప్పటివరకు పలు ప్రభుత్వ పాఠశాలల్లోని 18 వేలమంది విద్యార్థులు, 600 మంది ఉపాధ్యాయులకు హ్యాండ్‌రైటింగ్‌పై శిక్షణ ఇచ్చారు.

## క్లుప్తంగా

### దివ్యాంగ పెన్షన్‌దారుల పరిశీలన పూర్తి



యడ్లపాడు: దివ్యాంగ పెన్షనర్ల వెరిఫికేషన్ ప్రక్రియ మంగళవారం మండలంలో జరిగింది. మండలం పరిధిలో 12 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 31 మంది రూ.15వేల పొందుతున్న పెన్షన్‌దారులు ఉన్నారు. క్షేత్రస్థాయిలో పెన్షన్‌దారుల ఇంటికి వెళ్లి కంటి నుంచి కాలి వరకు అన్ని పరీక్షలు చేసి సర్వేయాప్‌లో నమోదు చేశారు. సదరన్ క్యాంపుల్లో పొందిన సర్టిఫికెట్లలోని వైకల్య శాతం ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో పరిశీలన చేశారు. ఈ వెరిఫికేషన్ బృందంలో గుంటూరు జీజీహెచ్ ప్రొఫెసర్‌లు డాక్టర్ అయ్యప్పనాయుడు, లక్ష్మీకాంత్, యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యులు పి భరద్వాజ, సీహెచ్‌వో ఎస్ పున్నారావు, ఎంపీడీవో హేమలతాదేవి, వెలుగు ఏపీఎం రవీంద్ర, సీసీలు, పలయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఈసర్వేలో పాల్గొన్నారు.

### ఒకటి నుంచి ఒకసారి వాడే ప్లాస్టిక్ కవర్ల నిషేధం



నరసరావుపేట: ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పట్టణంలో 120 మైక్రాన్‌ల కంటే తక్కువ మందంగల ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల విక్రయాలు, వినియోగాన్ని ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి నిషేధించటమైందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. ఈ మేరకు వ్యాపార, వాణిజ్య, వినియోగ సంస్థలు, ఫంక్షన్ హాల్స్ యజమానులు నిబంధనలు పాటించాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. జాతీయ హరిత ట్రిబ్యునల్, సుప్రీం కోర్టు ఉత్తర్వులు మేరకు ఒకసారి వాడి పడేసే సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ పుల్లలతో కూడిన ఇయర్ బడ్స్, బెలూన్లు, ప్లాగులు, క్యాండీ, ఐస్‌క్రీమ్ స్టిక్స్, కప్పులు, కత్తిపీటలు, కత్తులు, ఫోర్కులు, స్పూన్లు, స్ట్రాలు, ట్రేలు, సిగరెట్ పెట్టెలు, స్వీట్ బాక్స్‌లు, ఇన్విటేషన్ కార్డులు, డెకరేషన్‌కు ఉపయోగించే థర్మాకోల్, స్టిరర్స్, ప్లాస్టిక్ బ్యానర్లు, కర్రీస్ పాయింట్లలో వినియోగించే సంచులు నిషేధించారన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిల్వలు, ఎగుమతులు, దిగుమతి, రవాణా, వినియోగం చేయకూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి మొదటి తప్పిదంగా రూ.20 వేలు జరిమానా విధించబడుతుందని, అనంతరం రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలు, ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించబడుతుందన్నారు. వాణిజ్య లైసెన్స్ రద్దుచేసి షాపులను సీజ్ చేయటం జరుగుతుందని వివరించారు.

### పేద విద్యార్థులకు ఆర్థికసాయం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్లలోని జడ్పీ హెచ్ పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఉన్నత చదువుల కోసం 2004-05 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆర్థికసాయం అందించారు. ఈ ఆర్థికసాయాన్ని ఎంఈవో రవిచంద్ర చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేయించారు. ఇలాంటి సాయాన్ని తమ తరపున విద్యార్థులకు అందించేందుకు ముందుంటామని పూర్వపు విద్యార్థి మేదరమెట్ల సురేష్ తెలిపారు.

### అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు



చిలకలూరిపేట: అనుమతులు లేని అక్రమ లేఅవుట్లపై అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ లేఅవుట్‌లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, డ్రైయినేజీ, వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలన్నారు. పట్టణంలోని పార్కుల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా ప్రజల్లో చులకన కాకూడదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, టీపీఎస్ సుజాత, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అవసరమైన పంటల సాగు చేపట్టాలి


కంది పంటను పరిశీలిస్తున్న డీఏవో మురళి, వ్యవసాయాధికారులు

వినుకొండ(నూజెండ్ల): పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలంలోని బ్రాహ్మణపల్లి, జాలలపాలెం గ్రామాల్లోని పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని, రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, అవసరం మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని తెలిపారు. ఉద్యాన వన పంటల సబ్సిడీ స్కీంలు, సస్యరక్షణ చర్యల గురించి ఉద్యాన వన శాఖ అధికారి రసూల్ వివరించారు. కార్యక్రమంలో డీఏవో ఆఫీస్ సహాయ వ్యవసాయ సంచాలకులు రవికుమార్, వినుకొండ ఏడీఏ రవిబాబు, పశువైద్యాధికారి శివాజీ, ఇన్‌చార్జి ఏవో జి. వరలక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పూర్వవిద్యార్థుల సహకారం అభినందనీయం

**వివేకనంద పూర్వవిద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు**


ఫర్నీచరు వితరణ చేసిన 2004 పూర్వ విద్యార్థులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల అభ్యున్నతిలో 2004 పదోవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు మంగళవారం అన్నారు. ఈ నెల 14న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించగా కొందరు పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు తమవంతు సహకారం చేస్తామని చెప్పిన వారందరు తూమాటి చెన్నయ్య, సాదినేని హరిబాబు, దన్నవరపు బ్రహ్మం, కొప్పురావూరి వీరాంజి, పొదిలి సతీష్, నాదెండ్ల చంద్రశేఖర్‌లు రూ. 30 వేలు విలువచేసే ఫర్నీచరు, రూ.30 వేల వ్యయంతో పాఠశాల క్రీడామైదానం అభివృద్ధికి తమ వంతు చేయూత అందజేయటం పలువురికు ఆదర్శమన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని, విద్యాకమిటీ చైర్మన్ గన్నవరపు శ్రీనివాసరావు, పీడీ కాకుమాను రాజేష్, బొల్లా పేరయ్య ఉపాధ్యాయులు తదితరులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

# విప్లవ విజయాన్ని సాధించిన ఏకైక వ్యక్తి కామ్రేడ్ లెనిన్

**నివాళులర్పించిన సీపీఎం నాయకులు**


పార్టీ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: ప్రపంచంలోని సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మలిచి విప్లవ విజయాన్ని సాధించిన ఏకైక వ్యక్తి కామ్రేడ్ లెనిన్ మాత్రమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం కార్మికవర్గ విప్లవ నాయకులు కామ్రేడ్ లెనిన్ 101 వర్ధంతి సభ నిర్వహించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ మండల కన్వీనర్ డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించిన సభలో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక భావాలు వికసించడం ప్రారంభమైందన్నారు. కార్పొరేట్ దోపిడీ ప్రభుత్వాల స్థానంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాల ఏర్పాటుకు కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ కష్టజీవుల రాజ్యాన్ని నిర్మించిన మహానేత లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, అనుముల లక్ష్మీశ్వర రెడ్డి మాట్లాడుతూ లెనిన్ ఆచరించిన విధానాలను ప్రచారం చేపట్టడం కమ్యూనిస్టుల తక్షణ కర్తవ్యమన్నారు. నాయకులు తాళ్లూరి పెద్దిరాజు,షేక్ సిలార్ మసూద్, కె.హనుమంత రెడ్డి, గుంటుపల్లి బాలకృష్ణ, మస్తాన్‌రెడ్డి, గాంధీ స్మారక సమితి నాయకులు ఈదర గోపీచంద్ పాల్గొన్నారు.

### ఆదమరిస్తే ఆస్పత్రికే!


ప్రమాద భరితంగా ఉన్న కల్వర్టు

మండలంలోని వేల్పూరు గ్రామంలో కల్లూరి వారి వీధి పాత కూరగాయల మార్కెట్ వద్ద డ్రెయినేజీపై నిర్మించిన కల్వర్టు నుంచి అధిక లోడు కల్గియున్న ఇసుక లారీ వెళ్లటం వలన ఒకవైపు పగలిపోయి ప్రమాదభరితంగా మారింది. నిత్యం ఈమార్గం నుంచి బైకులు వాహనాలు తిరుగుతాయి. ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు అధికారులకు తెలిపినా ఫలితం లేదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమంలో లిఖిత పూర్వకంగా దీనిపూ ఫిర్యాదు చేసినట్లు మండల బీజేపీ అధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

– శావల్యాపురం

# భావి జీవితం సంతోషంగా సాగాలి

- ఎస్పీ శ్రీనివాసరావు
- పదవీ విరమణ చేసిన హోంగార్డులకు చెక్కులు అందజేత


పదవీ విరమణ పొందిన హోంగార్డు చిన్నను సన్మానించిన ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: జిల్లా పోలీసు విభాగంలో పని చేస్తూ పదవీ విరమణ పొందినవారి భావి జీవితం నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో తూలతూగాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన హోంగార్డులను ఘనంగా సన్మానించి, చెక్కులు అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. బాపట్ల జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గతేడాది మే నాల్గవ తేదీన కె.సుమతీ పదవీ విరమణ పొందగా, ఫింగర్ ప్రింట్ బ్యూరోలో పనిచేస్తూ డి.సాంబమ్మ గతేడాది ఆగస్టు 14న పదవీ విరమణ పొందారు. అనంతరం ఆమె చనిపోవటంతో నామినీగా ఉన్న ఆమె కుమార్తె భూలక్ష్మికి, సుమతికి రూ.5 లక్షల చొప్పున రెండు చెక్కులను అందజేశారు. అలాగే కమ్యూనికేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జె.చిన్న మంగళవారం పదవీ విరమణ పొందగా, అతడిని శాలువాతో సత్కరించి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వీరు పోలీస్ విభాగానికి చేసిన సేవలు చిరస్మరణీయన్నారు. వారికి హృదయ పూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ పొందిన తర్వాత డిపార్టుమెంట్ పరంగా ఏ అవసరం ఉన్నా సరే స్వయంగా వచ్చి తనను కలవవచ్చని భరోసా ఇచ్చారు. హోంగార్డు ఆర్.ఐ కృష్ణ, కమ్యూనికేషన్ సీఐ పాల్గొన్నారు.

# బైపాస్‌కు మరమ్మతులు నిర్వహించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నరసరావుపేట రూరల్: గోతుల మయంగా మారిన బైపాస్‌రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని పీడీఎం నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు రోడ్డు జొన్నలగడ్డ నుంచి ఇస్సప్పాలెం వెళ్లే బైపాస్ రోడ్డును మంగళవారం పీడీఎం నాయకులు పరిశీలించారు. నిత్యం రహదారిలో భారీ వాహనాలతో పాటు లారీలు, ట్రాక్టర్లు ఇతర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రోడ్డులో పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో పాటు ప్రమాదాలు కూడా చోటుచేసుకోవడాన్ని స్థానికులు పీడీఎం నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో రోడ్డు సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మరమ్మతులకు అంచనాలు రూపొందించినట్టు అధికారులు చెబుతున్నారు తప్పించి పనులు జరగడం లేదని తెలిపారు. రోడ్డు మరమ్మతులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా అది క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని విమర్శించారు. సంక్రాంతి పండుగ లోపు రోడ్ల మరమ్మతులు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారని ఈ మేరకు బైపాస్ రోడ్డు మరమ్మతులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

# వేర్వేరు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు



మాట్లాడుతున్న ఏడీలు డాక్టర్ కోటిరత్నం, డాక్టర్ కళావతి, వైద్యాధికారి డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల, గోగులపాడు గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశుఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాలను జంతువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు డాక్టర్ కళావతి పాటు డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన సహాయ సంచాలకులు డాక్టర్ కోటిరత్నం సందర్శించారు. డాక్టర్ కోటిరత్నం మాట్లాడుతూ మహిళా పశు పోషకులు అందరూ సహకార సంఘాలుగా ఏర్పడాలన్నారు. సంఘాల ప్రాముఖ్యతను, వాటి అవసరాలు, వనగూరే లాభాలపై అవగాహన కల్పించారు.

అలాగే 245 గెదెలకు నట్టల నివారణ, 2012 కోళ్లకు టీకాలు, 2500 గొర్రెల కు బొబ్బ టీకాలు, 312 దూడలకు నట్టల నివారణ మందులు, 3 పశువులకు మందగొడి ఆపరేషన్‌లు, 28 గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి తెలిపారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శేషమ్మ, విప్పర్ల మాజీ సర్పంచ్ ఇమ్మడిశెట్టి కాశయ్య, పశుసంవర్ధక శాఖ అధికారులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు, కృష్ణాపురం గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు పశువైద్యాధికారులు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కృష్ణాపురంలో 64 మంది, వైకల్లు గ్రామంలో 56 మంది పాడిరైతులు లబ్ధిపొందారు, ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు సోముల గుణదీప్, పాలపర్తి గణేష్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

**సాతులూరులో...**

నాదెండ్ల: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని గణపవరం గ్రామీణ పశువైద్యాధికారి సాంబశివారెడ్డి చెప్పారు. మండలంలోని ఇర్లపాడు గ్రామంలో రెండో రోజు నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. సాతులూరులో జరిగిన పశు వైద్యశిబిరంలో డాక్టర్ సీహెచ్ శ్రీలక్ష్మీ పాల్గొని పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణకు మందులు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

**యడ్లపాడులో...**

యడ్లపాడు: పశువైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆశాఖ యడ్లపాడు ప్రాంతీయ సహాయ సంచాలకులు వై.రాధాకృష్ణ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద నిర్వహిస్తున్న శిబిరాలు మంగళవారం మండలంలోని కొండవీడు, ఉప్పరపాలెం, తుర్లపాడు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు చెందిన పెంపకందార్లు పశువులు, గొర్రెలు, మేకలను శిబిరానికి తీసుకురాగా, వైద్యులు వివిధరకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాల్లో పశువైద్యులు పి.రోజర్‌బెన్నీ, కలీషాబేగం, పి.కిరణ్‌మయి, సిబ్బంది పాల్గొన్నారు. వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

### గణపవరంలో సోలార్ డ్రైవ్ చోరీ


వస్తువులు చోరీకి గురైన సోలార్ ప్యానళ్ల వద్ద రైతు మస్తాన్‌రావు

నాదెండ్ల: పంట పొలాల్లో సోలార్ పంపుసెట్లు, విద్యుత్‌మోటర్లతో పాటూ పైపులను దొంగలు ఎత్తుకెళ్తుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. విలువైన వస్తువులు చోరీకి గురవుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గణపవరం గ్రామంలో కావూరు డొంక రోడ్డులో కొర్నెగంటి కోటేశ్వరరావు (మస్తాన్‌రావు) తన ఎకరం పొలంలో తైవాన్ జామ సాగు చేస్తున్నాడు. దీనికి కొన్నేళ్ల క్రితం సోలార్ పంపుసెట్టు అమర్చుకున్నాడు. పలుమార్లు పొలంలో విలువైన పంపుసెట్లు, పైపులను దొంగలు కోసుకెళ్లారు. తాజాగా సోమవారం అర్ధరాత్రి సోలార్ పంపుసెట్టులోని రూ.30 వేలు విలువజేసే డ్రైవ్‌ను చోరీ చేశారు. సోలార్ ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్ ఈ డ్రైవ్‌తో త్రీఫేజ్‌గా మారి మోటార్లకు విద్యుత్ సరఫరా అవుతుంది. దీని ద్వారా పొలానికి నీరందుతుంది. మంగళవారం పొలానికి వెళ్లిన రైతు కోటేశ్వరరావు డ్రైవ్ చోరీకి గురికావటంతో నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌కు క్వాలిటీ అక్రిడేషన్ సర్టిఫికెట్



నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని తమ హాస్పిటల్‌కు క్వాలిటీ కౌన్సిలింగ్ ఆఫ్ ఇండియా నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అనే క్వాలిటీ అక్రిడేషన్ సర్టిఫికెట్ ప్రదానం చేసినట్లు అంజిరెడ్డి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోగులకు క్లినికల్, నాన్ క్లినికల్, డయాగ్నొస్టిక్, లేబరోటరీ, మెయింటెనెన్స్ విభాగాల నిర్వహణలో క్వాలిటీని గుర్తించి ఈ క్వాలిటీ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారన్నారు. జాతీయస్థాయిలో తమ హాస్పిటల్‌కు క్వాలిటీ సర్టిఫికెట్ రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. అన్నీ రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు పల్నాడు ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ, పలు ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్‌ల ద్వారా ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. తాము అందజేస్తున్న సేవలను గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉంది

**డీడీఏ శివకుమారి**



శావల్యాపురం: మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందని వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డీడీఏ మద్దినేని శివకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు, వేల్పూరు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారులు మిరప పంటలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రబీలో సాగు చేసిన పంటలన్నీ ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించాలన్నారు. అలాగే పీఎం కిసాన్ యోజన పథకంలో నగదు జమ కాని రైతులందరు ఈకేవైసీ నమోదు చేయించాలన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, ఏఈవో పురేటి అశోక, వీఏఏలు అనూషా, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

### వనికుంటలో భారీ అగ్నిప్రమాదం

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని వనికుంట గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బచ్చనబోయిన ఆంజనేయులు నివాస గృహంలో ఇంటిలో ఉన్న నీళ్ళ మోటారు స్విచ్ అన్ చేయగా విద్యుదాఘాతమై మంటలు రేగి ఇంటికి అంటుకున్నాయి. పక్కనే ఉన్న షేక్ నన్నేసా ఇంటికి మంటలు వ్యాపించాయి. దీంతో రెండు పూరిళ్లు అగ్నికి అహుతయ్యాయి. ఈప్రమాదంలో బచ్చనబోయిన ఆంజనేయులు నివాస గృహంలో రూ.2 లక్షలు నగదుతో పాటు 56 గ్రాములు బంగారం కాలిపోయింది. షేక్ నన్నేసా నివాస గృహం సైతం పూర్తి స్థాయిలో అగ్నికి అహుతైంది. ఆరు పాడిగేదలు ఉండగా ఒక గేద ప్రమాదంలో మృతి చెందింది. మిగిలిన గేదలు తీవ్ర గాయా లయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది సకాలంలో రావడంతో పెను ప్రమాదం తప్పడంతో పాటు మంటలను అదుపులోకి తెచ్చారు. ఎస్సై యం. ఉమామహేశ్వరరావు రెవెన్యూ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరు అడిగిన తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదంలో ఆంజనేయులు రూ.13 లక్షలు, షేక్ నన్నేసా రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.